# మనో చీమ

**లేత** నీలంరంగు యూనిఫాంలో ఎక్కువ భాగం ఏసీ చల్లదనంలో మనోరమ చక్కగానే ఉంటుంది. ఆమె రీజెన్సీ హోటల్ రిసెప్షనిస్టు. చక్కగా నవ్వుతుంది. చక్కగా నవ్వుతూ చక్కగా మాట్లాడుతుంది. ఏడాదిపైగా ఏసీ చల్లదనంతో కొంచెం రంగు వచ్చింది. బి.కాం పూర్తవగానే ఆమెకి తండ్రి పెళ్లి కొడుకుల్ని వెతకడం మొదలుపెట్టేడు. మారుతీ షోరూంలో అతను సీనియర్ మెకానిక్. మనోరమకి అనుకోకుండా ఉద్యోగం వచ్చింది.

అట్లా ఏడాది పై నుంచీ ఉద్యోగిస్తూ ఒక శుక్రవారం అసుర సంధ్యవేళ ఆరు ఇరవై నిముషాలకి ప్రేమలో పడింది మనోరమ. నీలం జీన్సు మోకాళ్ల దగ్గిర కొంచెం చింపుకుని టీ షర్టులో ఒకతను రిసెప్షన్ దగ్గిరికి శుక్రవారం అసుర సంధ్యలో ఆరూ పదినిముషాలకి వచ్చేడు. ఆమెని చూసి తెల్లగా నవ్వేడు. ఆమె మామూలుగా రిసెప్షన్ చిరునవ్వుతో బదులిచ్చింది. కంపెనీ పేరుందిగానీ అతనికి కావలసిన వ్యక్తి లేడు. గదిలో మాత్రం ఎవరో ఉన్నారు. మొత్తానికి ఆమె అతనిక్కావలసిన వ్యక్తి గదిలోనే ఉన్నాడని తేల్చి నాలుగో అంతస్తులోకి పంపించింది. అప్పటికి సరిగ్గా ఆరూ ఇరవై మూడైంది. చాలాసేపు అయిన తరవాత అతను తిరిగొచ్చి ఆమె కోసం చూశాడు ("ఏంలేదు. థాంక్స్ చెప్దావని") మరో పది నిముషాల తరవాత మనోరమ వచ్చింది. అతను వెళ్లిపోయాడు. హఠాత్తుగా మనోరమ ఒంటరి దయిపోయింది. తరువాత నాలుగు వారాల్లో అయిదుసార్లు ఇద్దరూ కలుసు కున్నారు. హరి మెడికల్ రిప్రజెంటెటివ్. అప్పటికే నెల రోజుల్నించి ఉన్న సినిమాలకి వెళ్తుండేవాడు. హరి ఎప్పుడూ చల్లగా తెల్లగా నవ్వుతాడు. ఏ టూత్‌పేస్టుకైనా గర్వకారణం అతను. ఆ పెదాలు చాక్లెట్లలా ఉంటాయని అనేకసార్లు మురిసిపోయిందామె. అతను హైద్రాబాద్ నుంచి తెచ్చి ఇచ్చిన స్ప్రే ఆమెకి హాయిగా తిలిగింతలు పెట్టింది.

ఒకరోజు మధ్యాహ్నం మనోరమ హరి దగ్గిరికి వెళ్లింది. గదిలో ఎక్కడో అగరువత్తి వెలుగుతోంది. సోఫాలో కూచోపెట్టేడతను. పరిమళం ఆమెలోకి ప్రవేశించి కళ్లు మూతలు పడ్డాయి. ఇవాళ పెళ్లి గురించి అడిగితే బాగుంటుందనుకుందామె.

"కూచో కాఫీ చేస్తా" నన్నా డతను. గదంతా శుభ్రంగా ఉంది. ఒక పక్క మంచి మీద ఎర్రటి పూలదుప్పటీ తోటలా ఉంది. అతను కాఫీ కప్పుతో వచ్చి ఆమె పక్కన కూచున్నాడు. పైన ఫేను పరిమళాల్ని చిలుకుతోంది. కాఫీ వగరు వాసన ఆమెకి నచ్చింది.

కప్పు తీసుకుని రుచి చూసి 'ఓహో' అంటూ ఆమె కందించాడు. ఆమె కప్పు అందుకోగానే 'ఉక్కగా లేదూ?' అన్నాడతను. లేదు. లేచి చొక్కా తీసి మంచం మీదికి గిరాటేశాడు. తెల్లటి అతని ఛాతీ పొదరుతో నల్లవెంట్రుకలతో మెరుస్తోంది. ఒక చెయ్యి సోఫా మీదుగా ఆమె భుజం మీద వేసి నవ్వేడతను. గాఢంగా ప్రేమగా లోతుగా అతని కళ్లతోకి చూసిందామె. ఇంచుమించు అదే వరుసలో అతను కూడా ఆమె వేపు చూశాడు ఒంగి సున్నితంగా ఆమె కాఫీ పెదాల్ని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె అతని ఛాతీ మీద వాలిపోయింది. ఆమె వీపు నిమురుతున్నాడు హరి. తన్మయత్వంలో ఆమె ఒకసారి కళ్లు మూసుకుని తెరిచింది.

అప్పుడు చూసింది మనోరమ. హరి తెల్లటిఎడం చేతి జబ్బ మీద కరెంటుచీమగాపేరు ప్రతిష్టలు సంపాదించిన ఎర్ర చీమ. కరెంటు చీమ కుడితే ఎంత మంటో! ఆమె కళ్లు ఆందోళనతో విచ్చుకున్నాయి. క.చీ. తల ఎత్తి జాంపండు లాంటి జబ్బు నలువైపులా చూసుకుంటోంది. మనోరమ అది గమనించలేదు.

"అమో కరెంటు చీమ" తలెత్తి వేలితో చూపిస్తూ చిన్న అరుపు అరిచిందామె. ముందు చీమ వేపు చూశాడతను. ఆమె వేపు చూస్తూ తాత్త్వికంగా చిరునవ్వుతూ అన్నాడతను.

"మనూ, చీమలు కూడా ప్రాణులే. వాటికీ జీవించే హక్కుంది. ఇంత చిన్న చీమ కుడితేనే బాధపడితే వాటిని కాళ్ల కింద నలుపుతాం గదా వాటికి బాధ ఉండదా మనూ? నిజం చెప్పు మనూ." దయతో, ప్రేమతో, సకల ప్రాణికోటి పట్లా కరుణతో వెలిగిపోతున్న అతని కళ్లలోకిచూసి ఆమె పులకించి పోయింది. హరి తాత్త్వికంగా అవునుకాదా అని తల ఊపేడు.

"కుట్టనీ మనూ. ఏం చచ్చిపోతానా?" అన్నాడు.

క.చీ. ఆమె హృదయాన్ని కుట్టినట్టయింది. సుతారంగా చేత్తో అతని పెదాలు మూస్తూ భుజం మీదికివంగి గట్టిగా ఊదిందామె. క.చీ. సోఫా వెనకా మనోరమ అతని ఒళ్లోనూ రెండు సెకన్ల తేడాలో పడ్డారు. తరవాత ఆమెని ఎర్రదుప్పటి తోటలోకి తీసికెళ్లే డతను.

ఎనిమిది రోజుల తరవాత హరిజ్ఞాపకాలతో ఒళ్లు గాలిలో తేలిపోతూండగా స్కూటరు మీద ఇంటి కెడుతూ అదే స్థితిలో ఎదురుగా వస్తున్న ఇసకలారీని ఢీకొంది మనోరమ. తలకి దెబ్బతగిలి ఆస్పత్రికి వెళ్లే దారిలో మరణించింది మనోరమ.

మరణించి ఆరో రోజు నుంచీ మనోరమ ఆత్మ హరి గది చుట్టూ తిరుగుతోంది.

రెండ్రోజుల తరవాత ఆమె హరి వంటింట్లో గడప పక్కనచిన్న ఇంట్లో కరెంటుచీమగానూతన దేహం ధరించింది. ఆమె పెరిగి పెద్దదైనా హరి శరీరాన్ని ముట్టుకునే అవకాశం రాలేదు. ఒక రోజు మధ్యాహ్నం హరి జ్ఞాపకాలతో సతమతం అవుతూ మనోచీమ ఇంట్లోంచి బయటికి వచ్చింది. ఇల్లంతా అగరొత్తుల పరిమళం. మ.చీ. హృదయం కీచుమంది. చకచక సోఫా వెనక నుంచి హరి భుజం మీదికి నడిచి తన్మయత్వంలో అలాగే ఉండిపోడం చేత అతని ఒళ్లో కొద్ది బట్టల్తో పడుకున్న అమ్మాయి కనిపించలేదు.

"అమ్మో కరెంటు చీమ". చటుక్కున లేచి అంది అమ్మాయి. హరి ఆమె పెదాల మీదికి ఒంగినవాడు పైకి లేచి భుజం మీద చూసుకున్నాడు.

"దరిద్రపు ముండా చీమ. వంటింట్లో పుట్ట ఉన్నట్టుంది. రేపు మందు తీసుకొచ్చి కొడతాను. నయం నిన్ను కుట్టింది కాదు. నన్ను కుట్టినా పరవాలేదు. ఊ చావు ముండా."

నవ్వుతూ హరి చెయ్యెత్తి అరచేత్తో ధప్‌మని ఒక్క దెబ్బతో మ.చీ.ని పచ్చడి చేశాడు.

❖ ❖ ❖